క్లుప్తంగా

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



దాచేపల్లి : యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలో శనివారం చేపట్టారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మండలంలోని పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులతో మాట్లాడి సభ్యత్వాలు చేయించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని నాగేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాజారావు, తంగరం ఆనంద్‌కుమార్, కోటేశ్వరరావు, వాసుదేవరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

123 మందికి వైద్య పరీక్షలు



వెల్దుర్తి: మండల పరిధి ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలోని రచ్చమల్లపాడులో పీహెచ్‌సీ వైద్యాధికారి బత్తిన శ్రీరామ్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో నెలలో మూడు శనివారాలు వైద్య శిబిరాలు నిర్వహించడానిక ఏర్పాట్లు చేశామన్నారు. రచ్చమల్లపాడులో 123 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అవసరమైన రోగుల నుంచి నమూనాలను సేకరించి వ్యాధి నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఏడుకొండలు, సీహెచ్‌ఓ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కార్డులతో ప్రయోజనాలు

రెంటచింతల: ప్రభుత్వం అందిస్తున్న రుణ అర్హత కార్డుల వల్ల కౌలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ పంట నమోదు, పంట బీమా, కనీస మద్దతు ధర, రుణాలు, పంట నష్ట పరిహారం, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధికి కార్డు వల్ల అవకాశం ఉంటుందన్నారు. భూ యజమానులకు కార్డు వల్ల నష్టం జరగదని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారిని, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి కార్డు పొందాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 1,254 మందికి కార్డులు అందించామని తెలిపారు.

5న మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

కారెంపూడి: కారెంపూడి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు ఉంటుందని ఎంపీడీఓ జి. శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీపీ మేకల శారద సెలవు పెట్టడంతో వైస్ ఎంపీపీ బొమ్మిన సావిత్రి ఆ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. అయితే ఆ సెలవు రద్దు అయినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో సమావేశానికి ఎవరు అధ్యక్షత వహిస్తారనేది తేలాల్సి ఉంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత ముఖ్యం



రెంటచింతల: వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాలతోపాటు డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. శనివారం పీహెచ్‌సీలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఆరోగ్య, ఆశా కార్యకర్తలు సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు



రొంపిచర్ల: స్థానిక శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన సోలిశెట్టి నాగవర్ధన్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగవర్ధన్ హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై ఒంగోలు సమీపంలో ఉన్న కామేపల్లి పోలేరమ్మ అమ్మవారి గుడికి బయలుదేరాడు. రొంపిచర్ల సమీపంలోకి రాగానే చెక్ పోస్ట్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగవర్ధన్‌కు గాయాలయ్యాయి. తలకు హెల్మెట్ ధరించటం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై. శ్రీనివాసరావు

గురజాల: విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటైతే జీవితాలు నాశనం అవుతాయని, అలా చేసుకోవద్దని సీనియర్ సివిల్ జడ్జి వై. శ్రీనివాసరావు సూచించారు. మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో శనివారం విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, ర్యాగింగ్ అనర్థాలు, జైలు శిక్షల గురించి వివరించారు. న్యాయవాది బండి వీరభద్రుడు, ఎస్ఐ సౌందర్ రాజన్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గురజాల: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కోర్టులో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 14వ తేదీన అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు బండి వీరభద్రుడు, కొంగర హరిసత్యనారాయణ, షేక్ జానీబాషా, కలివెల ప్రభుదాసు, సీఐలు పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు

రెంటచింతల: స్థానికంగా వేంచేసియున్న శ్రీ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ పెద్దశెట్టి పల్లా వెంకటేశ్వర్లు, సభ్యులు శనివారం తెలిపారు. దేవస్థానం ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ శర్మ నేతృత్వంలో ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, వేదపారాయణం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచామృతాభిషేకాలు, నవగ్రహ మండపారాధన, సహస్ర కుంకుమార్చన, మంత్ర పుష్పం, వేడుకలను జరిపించనున్నారు. ఉదయం 10 గంటలకు బోనాలను సమర్పించనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం మహాన్నదానం ఉంటుందని తెలిపారు.

ముమ్మరంగా వరి నాట్లు



పాలువాయిగేటు గ్రామంలో వరినారు కట్టలు కడుతున్న కూలీలు



నాట్లు వేస్తున్న దృశ్యం

రెంటచింతల: మండలంలోని పలు గ్రామాలలో రైతులు ముమ్మరంగా వరినాట్ల పనులను చేపట్టారు. ఇప్పటి వరకు బోర్లు కింద, చెరువుల కింద ఉన్న ఆయకట్టులో నాట్లు వేశారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి భారీగా వరదనీరు వస్తుండటంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. దీంతో పల్నాడు ప్రాంత రైతులు ఎంతో సంతోషంతో వరి నాట్లు పనులలో నిమగ్నమయ్యారు. మంచికల్లు, పాలువాయిగేటు, రెంటాల, పాలువాయి, రెంటచింతల తదితర గ్రామాలలో ట్రాక్టర్లతో దమ్ము పనులు చేపట్టారు. వరి నాట్లు వేస్తుండటంతో పుడిమికి ఆకు పచ్చని బొట్టు పెట్టినట్లు ఎంతో అందంగా కన్పిస్తోందని రైతు గొలమారి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 95 శాతం మాగాణితో పల్నాడు కోనసీమగా పేరు పొందిన మంచికల్లు గ్రామంలో వరి నాట్లు ఊపందుకున్నాయి. ఈ ఖరీఫ్‌లో మండలంలోని 11 గ్రామాలలో మొత్తం 1,862 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు.

4 వేట కొడవళ్లు స్వాధీనం

గురజాల: వేట కొడవళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మండల పరిధిలోని దైద గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక శ్రీనివాస కాలనీలోని ఓ ఇంటి వద్ద గడ్డివాములో 4 వేట కొడవళ్లు ఉన్నట్లు గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ ఈ కొడవళ్లను ఎవరు తెచ్చారు? ఎందుకు తీసుకొచ్చారు? అనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం



మాచవరం: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని సర్పంచ్ సుశీలాబాయి అన్నారు. మండలంలోని నాగేశ్వపురం తండాలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం వల్ల వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కుమారిబాయి, ఆశా వర్కర్ తులసీబాయి, స్టాఫ్ నర్సు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట రూరల్: ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ పరీక్షలలో శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనభర్చినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం. పార్వతి శనివారం తెలిపారు. సైన్స్ ఒలంపియాడ్ లో స్టేట్ టాపర్‌గా జి.నాగశ్రీ రూ.1000 నగదు బహుమతి, గోల్డ్‌మెడల్ సాధించినట్టు తెలిపారు. అలాగే స్టేట్ ఎక్స్‌లెన్స్ అవార్డుల్లో కొల్లిపర రుత్విక్, పి.సంజయ్‌లు గోల్డ్‌మెడల్స్ సాధించారని వివరించారు. సబ్జెక్ట్‌ల వారీగా టాపర్లుగా 12 మంది విద్యార్థులు మెడల్స్ పొందినట్టు తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, జి.శంకర్, సూరిబాబు, జి.శివప్రియ, ఎస్.పావనిలను ప్రధానోపాధ్యాయినీ పార్వతి సత్కరించారు.

మానసిక దివ్యాంగుల సంక్షేమానికి కృషి

పిడుగురాళ్ల: మానసిక దివ్యాంగులకు చట్టపరమైన సేవలు, ప్రభుత్వ పథకాలు అందించడం ద్వారా సంక్షేమానికి కృషి చేయాలని పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. మురళీ గంగాధర్‌రావు సూచించారు. పట్టణంలోని నిమ్మతోట బజారులో ఉన్న సూర్యకిరణ్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... దివ్యాంగులకు న్యాయపరమైన హక్కులు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వారికి అందుతున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. కుమారస్వామి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దివ్యాంగులకు అందిస్తున్న సహకారం అభినందనీయం అన్నారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఉడతా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దివ్యాంగులకు సేవ చేయటం అదృష్టంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎ. రూత్‌టెనియస్, కోవూరి వెంకటేశ్వర్లు, మందా జాకబ్, ఎస్‌వీ కోటేశ్వరరావు, వెలిశల రామకృష్ణ, అహమ్మద్, నాయక్, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తాడేపల్లి నాగేశ్వరరావు, ఆతుకూరి ఉపేంద్ర, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కక్షలు వీడి అభివృద్ధిపై దృష్టి సారిద్దాం

గురజాల ఎమ్మెల్యే యరపతినేని



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మాచవరం: కక్షలు వీడి గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన మాచవరం మునుసుబు కల్యాణ మండపంలో తెలుగుదేశం మండల కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన వ్యక్తిగత గొడవలను దృష్టిలో ఉంచుకొని కొందరు ప్రతిదాడులకు పాల్పడడం సరికాదన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టిస్తే ఉపేక్షించబోమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని గొడవల జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. గ్రామాల అభివృద్ధి కాంక్షతో ప్రతి ఒక్కరు పని చేయాలని, గ్రామాల్లో స్నేహపూరిత వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలోనే పేదల అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు, నాయకులు కల్లం రాజశేఖర్‌రెడ్డి, మాలపాటి మల్లయ్య, దున్నా చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడికి నాయకుల నివాళులు

గురజాల: చల్లగుండ్ల శ్రీరామమూర్తి మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని, మండల ప్రజలు మంచి వైద్యుడిని కూడా కోల్పోయారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శ్రీరామమూర్తి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. స్వగ్రామమైన గురజాలలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు శ్రీరామమూర్తి భౌతికకాయాన్ని గురజాల ఎమ్మెల్యే యరపతినేని, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

జీవో రద్దు చేయాలని వైద్యుల వినతి

మాచవరం: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు పీజీ ప్రవేశానికి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబరు 85ను రద్దు చేయాలని మాచవరం సీహెచ్‌సీ సిబ్బంది కోరారు. ఈ మేరకు శనివారం వారు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు గత ప్రభుత్వ హయాంలో పీజీ ప్రవేశానికి 50 శాతం సీట్లు కేటాయించారని గుర్తుచేశారు. నేడు దీనిని 15 శాతానికి తగ్గించడంతో ఎంతో మందికి అన్యాయం జరుగుతుందన్నారు. వినతి పత్రం అందించిన వారిలో డాక్టర్ అన్వేష్, డాక్టర్ నస్రీన్, స్టాఫ్‌నర్సు శాంతమ్మ ఉన్నారు.

ఆటో డ్రైవర్లు క్రమశిక్షణ పాటించాలి



మాట్లాడుతున్న సీఐ వెంకట్రావు

పిడుగురాళ్ల: ఆటో డ్రైవర్లు క్రమశిక్షణ పాటించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఎస్. వెంకట్రావు పేర్కొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం వారికి సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీరియల్ ప్రకారం వాహనాలు నడపాలని సూచించారు. యూనియన్ లీడర్లు బాధ్యతగా పని చేసి ఆదర్శంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీమా, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

యంత్ర వినియోగంతో రైతులకు ఉపయోగాలు

దాచేపల్లి: కలుపు తీసే రోబో యంత్రంతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని అంబుజా ఫౌండేషన్ టీం లీడర్ సుధాకర్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పత్తి పంటలో రోబో యంత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వ్యవసాయ కూలీలతో సంబంధం లేకుండా రోబో చేసే పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా టీం లీడర్ సుధాకర్ మాట్లాడుతూ.. ఎకరం పొలంలో కలుపు తీయడానికి 20 మంది కూలీల అవసరం ఉంటుందని, ఈ రోబో ద్వారా అతి తక్కువ ఖర్చుతో కలుపు తీయవచ్చని చెప్పారు. రైతులకు శ్రమ, ఆర్థికభారం రోబోతో తగ్గుతుందని తెలిపారు. ఫామ్ సోధీ అంకుర సంస్థ ప్రతినిధులు శ్రవణ్, సాయినాథ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సివిల్ జడ్జి పి.ప్రియదర్శిని



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రియదర్శిని

సత్తెనపల్లి: మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా, తయారీ చట్ట వ్యతిరేఖమని మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శిని పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ బాబా గురుదేవ్ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేఖం(యాంటి డ్రగ్స్) పై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ చట్టం గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో డ్రగ్స్ ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్ సరఫరా, విక్రయ సమాచారం తెలిస్తే ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి టౌన్ ఎస్ఐ ఎం. సంధ్యారాణి, ప్యానల్ న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బీఎల్ కోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ దార్ల మాధవి, పారా లీగల్ వలంటీర్లు గోపాల్, కోట బాబూ రావు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట: ఫిరంగిపురం మండలం గరుడాచలపాలెం దళిత మహిళలపై దాడిచేసి కొట్టి సాంఘిక బహిష్కరణకు గురిచేసిన సంఘటనలపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు స్వయంగా బాధిత వర్గాన్ని సందర్శించి న్యాయం చేయాలని బాధితుల న్యాయ పోరాట కమిటీ (ఐద్వా) నాయకుడు డాక్టర్ గోళ్ల మూడి రాజసుందరబాబు కోరారు. శనివారం ఈ సంఘటనపై మొదటి ఏఎంఎం కోర్టులో విచారణ జరిగింది. అనంతరం బాధిత మహిళలతో కలిసి ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నాల్గున ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి పార్టీ వర్గీయులు బైకు ర్యాలీ చేసి గ్రామంలో ఇరువురు దళిత మహిళలపై దాడి చేసి కులం పేరుతో దూషిస్తూ కొట్టి చంపుతామని బెదిరించారన్నారు. అదే నెల 8న 40 కుటుంబాలకు చెందిన దళితులను సాంఘిక బహిష్కరణ చేశారన్నారు. 14వ తేదీన ట్రాక్టర్ డ్రైవర్‌ను చంపబోయారని, 16వ తేదీన తాళ్ల శేఖర్ అనే వ్యక్తిపై రెండు సార్లు దాడిచేసి చంపబోయారని వివరించారు. వీటన్నింటిపై చర్యలు తీసుకోవాలని కోరితే వారే బాధితులపై తప్పుడు కేసులు పెట్టి జైలు పాలు చేశారని అన్నారు.

దాహార్తి తీరే దారి చూపండి



అంచులవారిపాలెంలో మూసివేసిన వాటర్ ప్లాంట్

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెం పంచాయతీలో బాల వికాస్ సహకారం, పంచాయతీ నిధులతో వాటర్ ప్లాంట్‌ను 2021లో ఏర్పాటు చేశారు. నీలం వెంకయ్య వాటర్ ప్లాంట్‌గా అప్పటి నుంచి ప్రజల దాహార్తిని తీరుస్తోంది. నెలక్రితం కొద్ది పాటి మరమ్మతులు రావడంతో ప్లాంట్‌ను మూసివేశారు. దీంతో ప్రజలు మంచి నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజు ఈ వాటర్ ప్లాంట్ నుంచి సుమారు 100 క్యాన్‌ల నీటిని తీసుకెళ్తుంటారు. అంచులవారిపాలెంలో ఈ ఒక్క వాటర్ ప్లాంట్ మాత్రమే ఉంది. ఇప్పుడు ఇది కూడా మూసివేయడంతో కిలోమీటర్ దూరంలో ఉన్న అనుపాలెం వెళ్లి మంచి నీటిని గ్రామస్తులు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైన గ్రామ సచివాలయ కార్యదర్శి ముక్తారు స్పందించి, వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు నిర్వహించి, వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పోరాటానికి దక్కిన ఫలితం



పాలాభిషేకం చేస్తున్న నేతలు

పెదకూరపాడు: సుప్రీంకోర్టు తీర్పుతో 30 సంవత్సరాల పోరాటానికి ఫలితం దక్కిందని తెలుగుదేశం ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి పాటిబండ్ల బాలయ్య అన్నారు. పెదకూరపాడులో ఎస్సీ వర్గీకరణ పై కోర్టు తీర్పు నేపథ్యంలో అంబేడ్కర్, కృష్ణ మాదిగ, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడే చంద్రబాబు వర్గీకరణకు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అపార్టీ నాయకులు ఆర్తిమళ్ల రమేష్, వేమవరపు రాజారాం, జంగాల ప్రసాద్, పాటిబండ్ల శివయ్య, తాళ్ళూరు రమేష్, సారె కుక్క నాగేశ్వరరావు చంటి పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడికి రిమాండ్

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలోని జంగాల కాలనీకి చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం బొల్లెద్దుల కళాసాగర్ వద్ద నుంచి 150 గ్రాముల గంజాయిని అతడి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం నిందితుడిని గురజాల సబ్ జైలుకు రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు దుర్భరం

- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి
- సీఆర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు



గణపవరం సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి

నాదెండ్ల: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు దుర్భరంగా మారుతాయని, యువత దుర్వ్యసనాలకు బానిసలుగా మారకుండా మంచి అలవాట్లతో అందమైన జీవితాన్ని సాకారం చేసుకోవాలని చిలకలూరిపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఐ.స్వాతి చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో శనివారం మాదక ద్రవ్యాల వినియోగం, దుష్పరిణామాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.నరేంద్రరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, మత్తు పదార్థాలు సేవించటం ఆరోగ్యానికి హానికరమని, చట్టరీత్యా నేరమన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఎంతో ప్రమాదమని, చిన్న వయస్సు లోనే ప్రాణాలు కోల్పోతారన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిని రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపి సన్మార్గంలో నడిచేలా చేయవచ్చన్నారు. యువత మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, న్యాయవాదులు బి.రాజేష్, ఎం.భానుప్రసాద్, పి వెంకట్, జి.వి.హెచ్.ఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నడవడిక కలిగి ఉండాలి

వినుకొండ(నూజెండ్ల): విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి మహతి అన్నారు. జాతీయ లీగల్ సెల్ అథారిటీ, న్యూఢిల్లీ ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీస్ అథారిటీ అమరావతి సూచనలతో వినుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ఎం.మహతి మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటినుంచే భవిష్యత్‌ను జాగ్రత్తగా మలచుకోవాలని, తోటి విద్యార్థులను, గురువులను గౌరవిస్తూ సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని తెలియజేశారు. ఈ డ్రగ్ మహమ్మారి నుంచి జాగ్రత్తగా ఉండాలని, వాటి వల్ల మెదడు పనితీరు మందగిస్తుందని, మనిషి నియంత్రణ కోల్పోతారని తెలియజేశారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

13వ అదనపు న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ

నరసరావుపేట టౌన్: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి బంగారు భవిష్యత్‌ను కోల్పోవద్దని 13వ అదనపు న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిరోధంపై శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. ర్యాగింగ్ చేయటం వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. ర్యాగింగ్ చట్టం గురించి తెలియజేశారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండి క్రమ శిక్షణతో పాటు నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. కోర్టు ప్రాంగణం నుంచి మొదలైన ర్యాలీ ప్రధాన అంతర్గత వీధులమీదుగా కొనసాగింది. న్యాయమూర్తులు కె. మధుస్వామి, ఆర్. ఆశీర్వాదం పాల్, టి. ప్రవల్లిక పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం భూమాయపాలెం వద్ద ఆటోలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా ఐనవోలు పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ఏపీ 39 యూపీ 9792 నంబరు గల ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకోవడం జరిగింది. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం ఎవరి వద్ద నుంచి ఎక్కడి తరలిస్తున్నారు అనే సమాచారం తెలియాల్సి ఉందని, కనీసం ప్రభుత్వ గోతాలు కూడా మార్చకుండా రేషన్ బియ్యం మాఫియా జరుగుతుందని, లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు.